


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
03-01-2026
పేజీలు: 02

# సీక్రెట్ చెప్పిన జాన్వీ కపూర్

ప్రస్తుతం చాలామందిని వేధిస్తున్న సమస్య అధికబరువు. బరువు నియంత్రణ కోసం రకరకాల టిప్స్, డైట్స్ ఫాలో అవుతూ చాలా కష్టపడుతుంటారు. అయితే వెయిట్ లాస్ అంటే జిమ్‌లో చెమటోడ్చడం, డైట్ పేరుతో కడుపు మాడ్చుకోవడం అనేది అందరికీ తెలిసిందే. కానీ ఒక స్టార్ హీరోయిన్ మాత్రం ఒక సింపుల్ ఈటింగ్ హ్యాక్‌తో ఈ సమస్యకు సొల్యూషన్ ఇచ్చింది. కష్టపడి వర్కౌట్ చేయకుండా, కేవలం ఒక చిన్న హ్యాబిట్ మార్చడంతోనే బరువు కంట్రోల్‌లోకి తెచ్చుకోవచ్చని చెబుతోంది. స్టార్ హీరోయిన్ చెప్పిన ఈ సీక్రెట్ వైరల్ అవుతోంది, ఎందుకంటే అది సైన్స్ బ్యాక్డ్, ఈజీ టు ఫాలో. ఈ హ్యాక్ ఆమె స్లిమ్ ఫిగర్‌కు కీలకమైనది, మరి మీరు కూడా ట్రై చేస్తారా? చిన్న పోర్షన్‌లలో తీసుకుని, ఒక్కో బైట్‌ను జాగ్రత్తగా నములుతూ తినాలని సూచించింది. ఇదే తన డైట్ సీక్రెట్ అని చెప్పుకొచ్చింది. అదే విషయంపై కాలిఫోర్నియా గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ పల్ మానిక్కం కూడా మాట్లాడారు. 'ఒక్కో బైట్‌కు 32 సార్లు నమలాలి. ఎందుకంటే మనకు 32 పళ్లు ఉన్నాయి' అని ఆయన సూచించారు.







# కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది

గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి తనను కొండగట్టు అంజన్నే కాపాడారని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని నేడు ఏపీ డిప్యూటీ సీఎం దర్శించుకున్నారు. తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వాయుపుత్ర సదన్ ధర్మశాల, దీక్ష విరమణ మండపానికి భూమి పూజ చేశారు. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో 100 గదులు ఉండేలా ధర్మశాలను నిర్మించేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. 'అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మను ఇచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో తలుచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు' అని అన్నారు. టీటీడీ, తెలంగాణ నేతల సమిష్టి కృషితోనే ధర్మశాల నిర్మాణం విషయంలో ముందడుగు పడిందని అన్నారు. భక్తుల బలమైన సంకల్పంతో ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బృందావనం రిసార్ట్‌లో సర్పంచ్‌లు, జనసేన కార్యకర్తలతో కూడా సమావేశమయ్యారు.

# మెక్సికోలో భారీ భూకంపం

మెక్సికోలో శుక్రవారం అర్ధరాత్రి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం ధాటికి భారీ భవనాలు ఊగిపోవడంతో జనం తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఉన్నఫళంగా ఇంట్లో నుంచి బయటపడి వీధుల్లోకి చేరారు. మెక్సికో సిటీ, శాన్ మార్కోస్ లతో పాటు ప్రముఖ పర్యాటక ప్రాంతం అకపుల్కో నగరంలో భూకంప తీవ్రత ఎక్కువగా ఉంది. పలుచోట్ల నివాస సముదాయాలు కూలిపోయాయి. ఇప్పటి వరకు ఇద్దరు మరణించారని, మరో 12 మందికి గాయాలయ్యాయని అధికారులు పేర్కొన్నారు. మొత్తం 50కి పైగా భారీ భవనాలకు పగుళ్లు ఏర్పడ్డాయని చెప్పారు.స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7:30 గంటలకు భూకంపం మెక్సికో సిటీని వణికించింది. మెక్సికో ప్రెసిడెంట్ క్లాడియా షెయిన్ బామ్ మీడియా సమావేశంలో మాట్లాడుతుండగా భూకంపం సంభవించింది. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది



ప్రెసిడెంట్ ను వెంటనే బయటకు తరలించారు. శాన్ మార్కోస్ నగరానికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు మెక్సికో నేషనల్ సిస్మోలాజికల్ సర్వీస్ అధికారులు పేర్కొన్నారు. భూకంపం నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసింది. లౌడ్ స్పీకర్లలో ప్రకటనలు చేస్తూ ఇళ్లల్లోని వారిని వీధుల్లోకి చేరుకోవాలని హెచ్చరించింది.

# వ్యాపారి వద్ద రూ.7 కోట్లకు పైగా కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ కు చెందిన ఒక వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు భయభ్రాంతులకు గురిచేసి ఏకంగా రూ.7 కోట్లకు పైగా కాజేశారు.సోమాజిగూడకు చెందిన 81 ఏళ్ల వృద్ధుడు గతంలో వ్యాపారం చేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. గతేడాది అక్టోబర్ 27న ఆయన వాట్సాప్‌కు వచ్చిన కాల్‌లో ముంబయి నుంచి బ్యాంకాక్‌కు పంపిన కొరియర్‌లో ల్యాప్‌టాప్, పాస్‌పోర్టులు, మాదకద్రవ్యాలు ఉన్నాయని చెప్పి భయపెట్టారు. తాను ఎలాంటి కొరియర్ పంపలేదని చెప్పగానే, ముంబయి పోలీసులమంటూ మరో కాల్ చేసి మాదకద్రవ్యాల రవాణా, మనీ లాండరింగ్ కేసులు ఉన్నాయని బెదిరించారు.ఇంటి నుంచి కదలొద్దంటూ 'డిజిటల్ అరెస్ట్' చేశామని చెప్పి వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆర్థిక లావాదేవీల పరిశీలన పేరుతో తొలుత రూ.19.80 లక్షలు బదిలీ చేయించుకున్నారు. అనంతరం సిగ్నల్ యాప్ డౌన్‌లోడ్ చేయించి, మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్న రూ.7.12 కోట్లను తమ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. పరిశీలన పూర్తయ్యాక డబ్బు తిరిగి



ఇస్తామని నమ్మించారు.డిసెంబరు 29న మరోసారి ఫోన్ చేసి కేసు మూసివేతకు అంటూ మరో రూ.1.2 కోట్లు అడగడంతో వృద్ధుడికి అనుమానం వచ్చింది. ఇటీవల డిజిటల్ అరెస్టులపై వచ్చిన వార్తలను చూసి తాను మోసపోయినట్లు గ్రహించి శుక్రవారం 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కె.వి.ఎం. ప్రసాద్ తెలిపారు.

# ఘనంగా ప్రియాంకా గాంధీ కుమారుడి నిశ్చితార్థం

కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ, రాబర్ట్ వాద్రాల కుమారుడు రైహాన్ వాద్రా త్వరలో ఒక ఇంటివాడు కాబోతున్నారు. తన చిరకాల స్నేహితురాలు అవివా బేగ్‌తో ఆయన నిశ్చితార్థం రాజస్థాన్‌లోని రణథంబోర్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను ఈ జంట సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఫొటోల్లో రైహాన్ డార్క్ షేర్వాణీలో కనిపించగా, అవివా ఎంబెల్లిష్డ్ శారీలో మెరిసిపోయారు. తమ చిన్ననాటి ఫొటోను కూడా షేర్ చేస్తూ, తమ స్నేహం ఎంత పురాతనమైనదో వారు గుర్తుచేసుకున్నారు.అవివా బేగ్ ఢిల్లీకి చెందిన ప్రముఖ కుటుంబానికి చెందిన వారు. ఆమె తండ్రి ఇమ్రాన్ బేగ్ వ్యాపారవేత్త కాగా, తల్లి నందితా బేగ్ ఇంటీరియర్ డిజైనర్. నందితకు ప్రియాంకా గాంధీతో దశాబ్దాల కాలంగా మంచి స్నేహం ఉంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం 'ఇందిరా భవన్' ఇంటీరియర్ డిజైనింగ్‌లో కూడా ఆమె కీలక పాత్ర పోషించారు.





# అర్ష్‌దీప్ సింగ్ విజృంభణ

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపుర్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచులో పంజాబ్ పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన పంజాబ్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో సిక్కిం తొలుత బ్యాటింగ్‌కి దిగింది. పంజాబ్ తరఫున బరిలోకి దిగిన టీమిండియా యువ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ విజృంభించడంతో సిక్కిం జట్టు విలవిల్లాడింది. కేవలం 22.2 ఓవర్లకే ఆ జట్టు కుప్పకూలింది. అర్ష్‌దీప్ బౌలింగ్ ధాటికి ప్లేయర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. 75 పరుగులకే సిక్కిం ఆలౌటైంది. తమంగ్(13), గురిందర్ సింగ్(10), సప్తుల్లా(10) వీరే టాప్ స్కోరర్స్. అర్ష్‌దీప్ సింగ్ 5 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన కనబర్చాడు. సుఖ్‌దీప్, మార్కండే తలో రెండు, బ్రార్ ఒక వికెట్ పడగొట్టాడు. 76 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన పంజాబ్ కేవలం 6.2 ఓవర్లలో ఆటను ముగించింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 81 పరుగులు చేసింది. దీంతో పది వికెట్ల తేడాతో సిక్కింపై ఘన విజయం సాధించింది. ఓపెనర్లు హర్నూర్ సింగ్(22), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(53) హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. ఇద్దరూ నాటౌట్‌గా నిలిచారు.




# రణ్‌వీర్ ప్లేస్‌లోకి హృతిక్ రోషన్?

బాలీవుడ్ ఐకానిక్ ఫ్రాంచైజీ 'డాన్' గురించి ప్రస్తుతం ఒక సంచలన వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఫ్రాంచైజీ నుంచి బాలీవుడ్ బాదుషా షారుఖ్ ఖాన్ తప్పుకున్న తర్వాత 'డాన్ 3' బాధ్యతలను రణ్‌వీర్ సింగ్ అందుకుంటారని అందరూ భావించిన విషయం తెలిసిందే. కానీ ఇప్పుడు సీన్ మొత్తం మారిపోయినట్లు కనిపిస్తోంది. కొత్త ఏడాదిలో బాలీవుడ్ ఒక కొత్త 'డాన్'ను చూడబోతోందనే వార్త బి-టౌన్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. గతేడాది 'ధురంధర్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న రణ్‌వీర్ సింగ్ అనివార్య కారణాల వల్ల 'డాన్ 3' నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. డేట్స్ సర్దుబాటు కాకపోవడం లేదా ఇతర ప్రాజెక్టుల ఒత్తిడి వల్ల ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు రణ్‌వీర్ స్థానంలో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.




# 'కల్కి-2' షూటింగ్‌కు సిద్ధం

'కల్కి 2898ఏడీ' చిత్రాన్ని ఓ విధంగా భారతీయ వెండితెర సంచలనం అని చెప్పాలి. ఎందుకంటే.. ఫ్రాంచైజీల్లో తొలిభాగం వెయ్యికోట్ల పైచిలుకు వసూళ్లను రాబట్టడం 'కల్కి 2898ఏడీ' విషయంలోనే జరిగింది. ప్రస్తుతం రెండో భాగం కోసం ప్రేక్షకులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే.. ప్రభాస్ 'స్పిరిట్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. అది పూర్తయితే తప్ప ఆయన తర్వాత సినిమా గురించి ఆలోచించే పరిస్థితి లేదు. అందుకే.. 'కల్కి' బృందం షెడ్యూల్స్‌లో మార్పులు చేశారని వినికిడి. కథానుగుణంగా ఈ రెండో భాగంలో కమల్‌హాసన్ పాత్ర చాలా కీలకం.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# మద్యం మత్తులో నడిరోడ్డుపై కారుపైకెక్కి నృత్యాలు

త్తరప్రదేశ్‌లోని నోయిడాలో కొందరు ఆకతాయిలు రెచ్చిపోయారు. ఫుల్‌గా మద్యం సేవించి రద్దీ రహదారిపై కారుపైకెక్కి నృత్యాలు చేశారు. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలను అక్కడే ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన కొందరు తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఆ వీడియోలు వైరల్‌గా మారాయి. డిసెంబర్ 31న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరుగురు యువకులు ఫుల్‌గా మద్యం సేవించి మారుతి ఆల్టో కారులో ప్రయాణించారు. మార్గం మధ్యలో కారు ఆపి దాని రూఫ్‌టాప్ పైకెక్కి నృత్యాలు చేశారు. వీరి చర్యతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న స్థానికులు ఈ తతంగాన్నంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతోంది. ఇక ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు రూ.67 వేలు జరిమానా విధించి షాకిచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సరికొత్త ప్రేమకథ ‘వశం’



చేతన్, కావ్య, రాజీవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘వశం’. స్వీయనిర్మాణ దర్శకత్వంలో కోన రమేష్ రూపొందిస్తున్నారు. గిరిజన ప్రాంతంతో పాటు నగర నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇదని, ఆద్యంతం ఆసక్తికరమైన మలుపులతో ఆకట్టుకుంటుందని దర్శకనిర్మాత తెలిపారు. తెలుగు, కన్నడ భాషల్లో ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: శంకర, సంగీతం: కిరణ్ తోటంబ్లే, నిర్మాతలు: కోన రమేష్, యెన్నంశెట్టి ఆంజనేయులు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, కొరియోగ్రఫీ: కోన రమేష్.




# అఖిల్ అక్కినేని 'లెనిన్' మూవీలో 'భారతి'గా భాగ్యశ్రీ

అక్కినేని అఖిల్ హీరోగా, మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘లెనిన్’. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ కీలకమైన అప్డేట్ ఇచ్చారు. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ చిత్రంలో ఆమె ‘భారతి’ అనే పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించారు. నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ సోషల్ మీడియా ఖాతాలో ఈ పోస్టర్‌ను పంచుకుంది. "లెనిన్ ప్రేమ.. భారతిని పరిచయం చేస్తున్నాం" అనే క్యాప్షన్‌తో పోస్టర్‌ను రిలీజ్ చేసింది. అంతేకాకుండా, సినిమా నుంచి మొదటి సింగిల్‌ను జనవరి 5న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ పోస్టర్ ద్వారా 2026 వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. నిజానికి ఈ సినిమాలో కథానాయికగా మొదట శ్రీలీలను ఎంపిక చేశారు. అయితే, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆమె స్థానంలో భాగ్యశ్రీ బోర్సేను తీసుకున్నారు. గతంలో అఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.

## మావోయిస్టులకు మరో బిగ్ షాక్

# భారీ ఎన్‌కౌంటర్, 14మంది మృతి



మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసుల కాల్పుల్లో 14 మంది మావోయిస్టులు చనిపోయారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. సుక్మా — బీజాపూర్ జిల్లాల్లో భద్రతా దళాలు — మావోయిస్టుల మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. సమాచారం ప్రకారం, నక్సలైట్లు — భద్రతా దళాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 14 మంది నక్సలైట్లు మరణించారు. సుక్మా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సలైట్లు మరణించగా, బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు మరణించారు. శనివారం (జనవరి 03) ఉదయం 5 గంటల నుండి ఈ ప్రాంతంలో భద్రతా దళాలు — మావోయిస్టుల మధ్య అడపాదడపా ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయని భద్రత దళ అధికారులు తెలిపారు. మొత్తం 14 మంది నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

సుక్మాలో 12 మంది నక్సలైట్లు మృతి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో శనివారం (జనవరి 3) భద్రతా దళాలతో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో పద్నాలుగు మంది నక్సలైట్లు మరణించారని పోలీసులు తెలిపారు. సుక్మాలో 12 మందికి పైగా నక్సలైట్లు మరణించగా, పొరుగున ఉన్న బీజాపూర్ జిల్లాలో తెల్లవారుజామున ఇద్దరు మరణించారని పోలీసులు తెలిపారు. సుక్మా జిల్లా దక్షిణ ప్రాంతంలోని అడవిలో కాల్పులు జరిగాయని, అక్కడ భద్రతా సిబ్బంది బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో ఉందని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. “ఇప్పటివరకు 12 మందికి పైగా నక్సలైట్లు హతమయ్యారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మరిన్ని వివరాలను తరువాత పంచుకుంటాము” అని ఆయన అన్నారు.

బీజాపూర్‌లో ఇద్దరు నక్సలైట్లు హతం బీజాపూర్‌లో, మరొక అధికారి మాట్లాడుతూ, జిల్లా దక్షిణ ప్రాంతంలోని అడవిలో ఉదయం 5 గంటల ప్రాంతంలో రాష్ట్ర పోలీసు విభాగం అయిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ బృందం ఇలాంటి ఆపరేషన్‌లో పాల్గొంటున్నప్పుడు కాల్పులు జరిగాయని చెప్పారు. సంఘటన స్థలం నుండి ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అడపాదడపా కాల్పులు కొనసాగుతున్నాయని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని అధికారి తెలిపారు. గత సంవత్సరం, ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలతో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మంది నక్సలైట్లు మరణించారు. ఇటీవల ఒడిశా కాందమల్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణేశ్ ఉయికే చనిపోయారు. గణేశ్‌తో పాటు ఆరుగురు మావోయిస్టులు పోలీసుల కాల్పుల్లో చనిపోయారు.

# జీహెచ్ఎంసీ విభజనపై బీఆర్ఎస్ గళం




సికింద్రాబాద్ ప్రత్యేక కార్పొరేషన్ కోసం పోరాటం హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిలోని వార్డుల పునర్విభజన తీరుపై భారత్ రాష్ట్ర సమితి (BRS) నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం గూగుల్ మ్యాప్స్ ఆధారంగా విభజన చేయడం ఏంటని వారు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. శాస్త్రీయత లేని ఇటువంటి చర్యల వల్ల భవిష్యత్తులో పరిపాలన పరమైన ఇబ్బందులు తలెత్తుతాయని, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను కాపాడేందుకు, దానిని ప్రత్యేక కార్పొరేషన్‌గా ప్రకటించాలని బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ ప్రత్యేక కార్పొరేషన్ సాధించే వరకు ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం జంట నగరాల అస్తిత్వాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దీనిని అడ్డుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన ఈ సందర్భంగా మీడియాకు వెల్లడించారు. జంట నగరాలను తమ ఇష్టం వచ్చినట్లుగా విడదీస్తూ, ప్రజల మనోభావాలతో ఆడుకోవడం సరైంది కాదని తలసాని మండిపడ్డారు. దశాబ్దాలుగా కలిసి ఉన్న ప్రాంతాలను హేతుబద్ధత లేకుండా వేరు చేయడం వల్ల ప్రజల మధ్య ఉన్న అనుబంధం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల సౌకర్యార్థం ఉండాలి తప్ప, వారిని అయోమయానికి గురిచేసేలా ఉండకూడదని ఆయన హితవు పలికారు. ప్రజల మనోభావాలను గౌరవించని ఏ నిర్ణయాన్నైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పారు.

## ఆరోగ్యంపై వస్తున్న వార్తలపై స్పందించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఆరోగ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని స్పష్టం చేశారు. అయితే వైద్యులు సూచించిన మోతాదుకన్నా ఎక్కువగా తాను ఆస్పిరిన్ తీసుకుంటున్నానని తెలిపారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు పంచుకున్నారు.ట్రంప్ ఆరోగ్యంపై గతంలో సోషల్ మీడియాలో అనేక పుకార్లు షికారు చేశాయి. కొంతకాలం ఆయన బహిరంగంగా కనిపించకపోవడం, కార్యక్రమాల్లో పాల్గొనకపోవడంతో ‘ట్రంప్ మిస్సింగ్’ అంటూ ప్రచారం కూడా చేశారు. అలాగే ఆయన చేతులు, కాళ్లపై గాయాలు కనిపించడంతో వాటిని కవర్ చేసేందుకు మేకప్ వేసుకున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. దీనిపై అప్పట్లో స్పందించిన ట్రంప్, తన జీవితంలో ఇప్పటి వరకు ఇంత ఆరోగ్యంగా ఎప్పుడూ లేనని చెప్పడంతో ఆ పుకార్లకు తెరపడింది.తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆరోగ్యంపై ట్రంప్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా తాను ఆస్పిరిన్ టాబ్లెట్లు తీసుకుంటున్నానని, అయితే, డాక్టర్లు రోజుకు 81 మిల్లీగ్రాములు సూచిస్తే తాను మాత్రం 325 మిల్లీగ్రాములు తీసుకుంటున్నానని తెలిపారు. రక్తాన్ని పలుచగా ఉంచడంలో ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. తన గుండెలో చిక్కటి రక్తం ప్రవహించడం తనకు ఇష్టం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఇటీవల వైట్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమాల్లో తాను వినికిడి సమస్యలు ఎదుర్కొంటున్నానని, తరచూ నిద్రపోతున్నానని వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆయన ఖండించారు. తన ఆరోగ్యం గురించి పదే పదే మాట్లాడుతుండటం తనకు ఇబ్బందిగా ఉందన్నారు.

# బ్రెజిల్‌లో లారీ, బస్సు ఢీ.. 11 మంది మృతి



బ్రెజిల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ, బస్సు ఎదురెదురుగా వచ్చి వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 11 మంది అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. రియో గ్రాండే డో సుల్ రాష్ట్రంలోని కారాజిన్హో సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ( మెక్సికో కాలమాన ప్రకారం) ఈ ప్రమాదం జరిగింది. ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ, బస్సు వేగంగా ఢీకొన్నట్లుగా ఫెడరల్ హైవే పోలీసులు వెల్లడించారు. అయితే ఈ ప్రమాదంలో బస్సు క్యాబిన్ లారీలోకి చొచ్చుకునిపోయింది. అలాగే లారీలోని ఇసుక మొత్తం బస్సులోని ప్రయాణికులపై పడిపోయింది. దీంతో ఇసుక కింద పడి 11 మంది ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

# కీలక నిర్ణయం తీసుకున్న అలియా భట్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ ఇప్పుడు తన కెరీర్‌లో మరో కొత్త దశను ఆస్వాదిస్తోంది. వరుసగా సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో టాప్‌లో కొనసాగుతున్న అలియా... తాజాగా తన పని తీరులో కీలక మార్పులు చేసుకుంటోంది. ఇప్పటివరకు ఒకేసారి రెండు మూడు సినిమాలు చేయడమే అలవాటుగా ఉన్న ఆమె, ఇకపై ఆ పద్ధతికి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఈ ఏడాది అలియా ‘ఆల్ఫా’, ‘లవ్ అండ్ వార్’ వంటి భారీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తల్లిగా తన బాధ్యతలకు పూర్తి ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై అలియా స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అలియా, మాతృత్వం తన జీవితాన్ని ఎలా మార్చిందో ఓపెన్‌గా మాట్లాడింది. “రాహా మా జీవితంలోకి వచ్చిన తర్వాత నా ప్రొఫెషనల్ లైఫ్ పూర్తిగా మారిపోయింది. బిడ్డను చూసుకోవాల్సిన బాధ్యత కారణంగా నా పనిలో సహజంగానే వేగం తగ్గింది. అయినా నేను చాలా సంతృప్తిగా, సంతోషంగా ఉన్నాను” అని అలియా చెప్పింది.

